

# మధ్యతరగతి మందహాసం

-చెళ్ళూరి సీతారాజేశ్వరరావు

శ్రీనివాసరావు కారు దగ్గరకి నడచాడు.

శారద గుమ్మాలు చివరదాకా వెళ్ళి "మరచిపోకురా అన్నయ్యా .మీబావగారి ప్రమోషన్ సంగతి" అన్నది. శ్రీనివాసరావు తలూపాడు. కారు స్టార్టయింది. నాకేసి వీడ్కోలుగా చూసి నవ్వాడు. చేతులు ఆడించాను!

"వీధిలోకిపోయి కూడ చెప్పాలా?" శారద చేసిన పని నాకేం నచ్చలేదు. ఇంట్లోకి రాగానే ఆమె మీద చిటపట లాడాను.

"వాడుత్త మందమతండీ. ఇట్టే మరచిపోతాడు. కాగితం రాసిచ్చారనుకోండి. అయినా మరోసారి చెబితే తప్పేముంది?"

"ఏంలేదు....ఏముంది? తప్పంతా నాది. ఒకరి దయాదాక్షిణ్యాలకి ఆధారపడట మేమిటి! ఎప్పుడోప్పుడు వస్తుంది ప్రమోషన్!" నా మనసంతా కంపరంరేగుతోంది.

"కావలసిన వాడు కదానని చెప్పాను. ఎం.పీగా వుండి చెల్లెలుకి ఆ మాత్రం సాయం చెయ్యలేడా?" శారద సహజంగానే మాట్లాడింది. ఇంతలో పిల్లలు స్కూలునుంచి రావడంతో వంటింటిలోకి వెళ్ళింది. శారద చేసిన పని నాకేం నచ్చలేదు. నా పనికోసం మా బావమరది మీద ఆధారపడటం నాకు తలవంపుగా, బాధగా వుంది.

శారద గ్లాసు నాకిస్తూ. "ముందర సేమ్యా తీసుకోండి ...ఆనక తీరిగ్గా విచారిద్దురుగాని!" మందహాసం చేసింది. శారద భంగిమ, అభినయం నన్ను ఆహ్లాదపరిచింది.

రోజులు గడిచిపోతున్నాయి. ఈ విషయాన్ని నేను దాదాపు మరిచిపోయాను. జ్ఞాపకం వున్నా శ్రీనివాసరావు అంత ఇదిగా ప్రయత్నిస్తాడాని నిర్లక్ష్యం చేసేశాను. ఇరవై రోజుల్లో ఆఫీసుకి నా ప్రమోషన్ ఆర్డర్ వచ్చింది, ఏలూరు బదిలీ చేస్తూ!

నాలో ఆనందం సున్న! శారదని అడ్డం వేసుకుని సాధించిన విజయం. ఇందులో నా ప్రయోజకత్వం సున్న. పురుషాహంకారం నన్ను నిద్రపోనివ్వలేదు. చాలా అల్పజీవిని నేను. ఆడదాని సాయంతో అందలం ఎక్కాను!

"చూశారా ..మా అన్నయ్య అంతే చేసేస్తాడు." శారద సంబరపడిపోయింది.

"ఇందులో గంతులెయ్యడానికేముంది? లిస్టులో నా పేరు ఎప్పుడో ఎక్కింది. రాకేం చేస్తుంది?" అన్నాకసిగా. నా వల్లే

నా కుపకారం జంగిందనుక"ఎడంల"
తృప్తి కనిపించింది.

ఏలూరు మకాం మార్చాక ఏదో పని మీద గుంటూరు వెళ్ళాను. అకస్మాత్తుగా అక్కడ రెడ్డినాయుడు కనిపించాడు. నన్ను చూసి ఎంతో ఇదయ్యాడు. మాస్నేహితం అలాంటింది. వాడు కంట్రాక్టరుగా, నేను ఆఫీసర్‌గాకాక బాల్య అనుభూతితో చాలా సేపు మాట్లాడుకున్నాం. ఇంటికిరమ్మని బలవంతం పెట్టాడు. వెంటనే బయలుదేర వలిసి వున్నా వాడి మాట తీసెయ్యలేక లంచ్‌వరకూ ఆగాను!

"మీ శ్రీమతి దర్శనం అవదేం?" డ్రాయింగ్‌రూంలో చాలసేపు కూర్చున్నాక అడిగాను.

"ఈసరికి వచ్చెయ్యాలి. వెల్ఫేర్ మినిష్టర్ ప్రోగ్రాం వుంది టౌన్‌లో. మా ఆవిడ లైన్ జిల్లాగవర్నర్ తెల్సా?" సగర్వంగా చెప్పాడు.

రెండింటికి దమయంతి రాగానే భోజ నాలకి కూర్చున్నాం.

"నీ కోసమే ఆగాం. వెళ్ళిన పనయిందా?" కుతూహలంగా అడిగాడు.

దమయంతి సంకోచిస్తున్నట్టుచూసింది

"ఫర్వాలేదులే...వీడు మనవాడే. . కంట్రాక్టు దొరికిందా?"

దమయంతి అంగీకారంగా తలూపగానే రెడ్డినాయుడో పున్నమి కనిపించింది. "చూశావా చలపతీ ..పదిలక్షల టెండర్ సంపాదించింది భార్యామణి. . నేనింత అభివృద్ధిలోనికి రావడానికి కారణం దమ యంతే సుమా!"

"ఊరుకోండి ..మీరు మరీను" దమ యంతి అభిమానంగా కోప్పడింది.

ఆ రాత్రి ఇంటకు వచ్చేశాను. ప్రయాణం అలసటవల్ల పెందరాళే మెలకువ వచ్చేసింది. ఇక నిద్రపట్టే అవకాశం లేదని వరండాలో సిగరెట్ కాల్చుకుంటూ కూర్చున్నాను.

అప్పలమ్మ గుమ్మాలు కడుగుతోంది. ఇంతలో ఎవరో పిలిచారు ఆమెని. కిటికీ లోనుంచి చూశాను. ఆఫీసు జవాను ముత్యాలు. సరిగ్గా పనిచెయ్యని కారణానికి వారంరోజులు సస్పెండు చేశాను. ఆ విషయం మాట్లాడడానికి వచ్చాడను కున్నాను. కాని వాడు లోపలకి రాలేదు. బయట పెళ్ళాంతోనే మాట్లాడు తున్నాడు.

"బాబుగారు ఇంకా నెగలేదు. రాతిరి ఏడకో దూరంపోయి వచ్చినారు. తీరిగ్గా సూసుకుని సెప్పాలి. అయినా ఎదవ పనులు మానేసి తిన్నగా శావరా అని నేను సెప్పడంలేదా ఇనుకోపోతే నీ కరమ" మొగుడ్ని కేకలేస్తోంది.

"ఈ సారికి సెప్పవే. ఈడ్నుంచి తిన్నగా నేకపోతే అడుగు."

"సర్లే .. బాబుగారు లేవనీ ఇంటికి పోయిరా."

నా మనసులో సంచలనం బయదేరింది. పై వర్గం మనిషి రెడ్డినాయుడు భార్యద్వారా సోపానాలు నిర్మించుకోవడం అదృష్టంగా భావిస్తున్నాడు. సమాజంలో చివరి వర్గం ప్రతినిధి ముత్యాలు పెళ్ళాం ద్వారా సాయం పొందడం తప్పనుకోవడంలేదు. మరి నా గ్లానికి కారణం ఏమిటి? అదే మధ్య తరగతి మందహాసం.

శారద కాఫీ తెచ్చింది.

"నువ్వు కూడా నా అదృష్టం శారదా" అంటూఆమెని దగ్గరకి తీసుకున్నాను.●●●